## క్లుప్తంగా

### వైభవంగా గంగమ్మ ఊరేగింపు

**రామసముద్రం :** మండలంలోని మూగవాడి పంచాయతీ ఎర్రప్పల్లి గ్రామానికి చెందిన గంగమ్మ ఊరేగింపు శుక్రవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు గ్రామస్తులు మూగవాడి, ఎం. గొల్లపల్లి, ఎర్రప్పల్లి, కెసి. పల్లి, గుంత యంబాడీ, గుండ్లపల్లి ఏడు గ్రామాల్లో అమ్మవారిని బ్యాండువాయిద్యాల నడుమ ఘనంగా తీసుకువచ్చారు. ఇంటింటా మహిళలు అమ్మవారికి కర్పూరహారతులు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు.

### విశ్వం కళాశాల కేసు లోక్ అదాలత్‌లో రాజీ

**కురబలకోట:** అంగళ్లు మార్గంలోని విశ్వం కళాశాలలో గత నెల 7న సెక్యూరిటీ ఇన్‌చార్జిపై జరిగిన దాడి కేసు లోక్ అదాలత్‌లో రాజీ అయినట్లు ముదివేడు పోలీసులు శనివారం తెలిపారు. విశ్వం కళాశాల సెక్యూరిటీ ఇన్‌చార్జి శ్రీకాంత్‌పై దాడి కేసులో అతను విశ్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, పీఈటీ వెంకటేష్‌తో పాటు మరో 11 మంది విద్యార్థులపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కేసు పెట్టిన సెక్యూరిటీ ఇన్‌చార్జి శ్రీకాంత్ తర్వాత మనసు మార్చుకున్నాడు. కేసు అవసరం లేదని లోక్ అదాలత్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మదనపల్లెలో జరిగిన లోక్ అదాలత్‌లో రాజీ అయ్యింది.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**కురబలకోట:** మండలంలో శనివారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు..మండలంలోని చిన్నపరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు శంకర్ రెడ్డి భార్యతో కలసి పక్క గ్రామానికి కూలి పనులకు వెళ్తుండగా బ్రాహ్మణఒడ్డుపల్లె వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో శంకర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే మదనపల్లె పట్టణం వాల్మీకి వీధికి చెందిన శేషాద్రి, సురేష్ కన్నెమడుగు దగ్గర శుక్రవారం రాత్రి ఓ పెళ్లికి డెకరేషన్‌కు వెళ్లారు. శనివారం వేకువజామున తిరిగి బైకులో మదనపల్లె వస్తుండగా ముదివేడు-అంగళ్లు మార్గంలో అదుపు తప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### తరిగొండ ఆలయంలో విశేషపూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**గుర్రంకొండ:** మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

### లారీ వర్కర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

**మదనపల్లె :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తరహాలో లారీ బాడీ వర్కర్స్, ఇతర ట్రాన్స్‌పోర్ట్ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని బసినికొండ లారీ బాడీ వర్కర్స్‌తో శనివారం ఏఐటీయూసీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ట్రాన్స్ పోర్ట్ రంగానికి అనుసంధానంగా ఉన్న లారీ బాడీషెడ్లలో అనేక రంగాలకు సంబంధించిన వర్కర్స్ దాదాపు 30 ఏళ్ళకు పైబడి ఈ వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నారన్నారు. , వర్కర్లకు చేయూత ఇవ్వకుండా పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సామాజిక భద్రత లేకుండా పనులు చేస్తున్న వర్కర్లకు ఈఎస్ఐ సౌకర్యం, ఎలాంటి పూచీ లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వ పెద్దలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మురళి, లారీ బాడీ వర్కర్స్ విజయ్ కుమార్, వెంకటరమణ,కమలాకర్ బాబు, దినేష్, జాఫర్, శ్రీనివాసులు, సయ్యద్ భాషా, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

# పాలకులకు ఈ దారిద్ర్యం కనిపించదా?

- దుస్థితిలో మదనపల్లె- కందూరు రోడ్డు
- గుంతలతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- తరచు ప్రమాదాలతో ఆసుపత్రి పాలవుతున్న ప్రయాణికులు
- ఎమ్మెల్యే ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలంటున్న ప్రజలు


ఎగవమాచిరెడ్డి గారి పల్లె వద్ద గుంతల మయమైన రోడ్డు


అధ్వానంగా మదనపల్లె- కందూరు సింగిల్ రోడ్డు

**నిమ్మనపల్లె:** మదనపల్లె- కందూరు రోడ్డు అధ్వాన స్థితిలో ఉండడంతో ఆ మార్గంలో ప్రయాణం నరకంగా మారుతోంది. దాదాపు 40 కిలోమీటర్లు గల ఈ మార్గంలో 30 కిలోమీటర్ల మేర సింగిల్ రోడ్డు కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫెంగల్ తుఫాను కారణంగా ఇటీవల కురిసిన భారీవర్షాలకు రోడ్డు పాడైపోవడంతో విచ్చలవిడిగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు దుర్భరంగా మారి వాహనదారుల కష్టాలు మరింత అధికమై, తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. గతంలో ఈ మార్గంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు సైతం కోల్పోయారు.

**ఎన్నికల హామీ ఏమైంది?**

ఎమ్మెల్యే షాజహాన్ బాష ఎన్నికల హామీని నిలబెట్టుకుని వెంటనే మదనపల్లె- కందూరు రోడ్డును డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిమ్మనపల్లె నుంచి మదనపల్లె మధ్య దూరం 23 కిలోమీటర్ల మేర ఉంది. ఈ మార్గంలోని ఆచార్ల పల్లె వద్ద నుంచి చల్లా వారి పల్లె వరకు డబుల్ రోడ్డు ఉండగా, మదనపల్లి పట్టణం నిమ్మనపల్లి సర్కిల్ నుంచి ఆచార్లపల్లి వరకు, చల్లా వారిపల్లి నుంచి నిమ్మనపల్లి మీదుగా కందూరు వరకు సింగల్ రోడ్డుగా ఉంది. ప్రతిరోజు ఈ మార్గంలో విద్యార్థులు కూలీలు రైతులు తమ అవసరాలపై మదనపల్లి కు రాకపోకలు సాగిస్తూ ఉంటారు.

**రైతులు, ప్రయాణికులకూ అవస్థలే..**

రైతులు వివిధ రకాల తమ పంటలను లగేజ్ వాహనాల ద్వారా మదనపల్లెకు తరలిస్తూ ఉంటారు. అధిక సంఖ్యలో టమాటా రైతులు తమ ఉత్పత్తులను మదనపల్లె మార్కెట్ కు ట్రాక్టర్ల ద్వారా చేరవేస్తారు. అంతేకాకుండా రాష్ట్రంలోనే రెండో శక్తి స్వరూపమైన శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానం, తవళం శ్రీ నేల మల్లేశ్వర స్వామి ఆలయం, ప్రసిద్ధిగాంచిన నిమ్మనపల్లి కట్ట దర్గా కు అధిక సంఖ్యలో ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజు ఈ మార్గంలో ప్రయాణిస్తారు. ఈ మార్గం దుస్థితికి చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ మార్గాన్ని డబుల్ రోడ్డు చేయాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లి- కందూర్ రోడ్డును డబుల్ రోడ్డు గా మార్చుతామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయిన ఈ సమస్యపై ఎమ్మెల్యే ఇప్పటి వరకు దృష్టి సారించక పోవడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపైనున్న గుంతలు చూడలేని ప్రజాప్రతినిధులు అధికారులు కళ్లకు గంతలు కట్టుకుని వ్యవహరిస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేసినా ఈ మార్గంలో గుంతలు పూడ్చకపోవడం గమనార్హం.

**ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి**



మదనపల్లె- కందూరు రోడ్డును డబుల్ రోడ్డు నిర్మాణం పై ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. హామీని నిలబెట్టుకుంటూ ఆయన వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రజల సౌకర్యం కోసం వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. నాయకులు, అధికారులు చొరవ తీసుకోవాలి. **- రవితేజ, నిమ్మనపల్లె**

**వాహనదారులకు ఇబ్బందులు**



మదనపల్లె- కందూరు రోడ్డు మార్గంలోని గుంతలను పూడ్చి వెంటనే వాహనదారుల ఇబ్బందులు తొలగించాలి. డబుల్ రోడ్డు నిర్మాణం ప్రతిపాదనవ దశను దాటించి కార్యరూపం దాల్చేలాగా ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులు కృషి చేయాలి. గత కొన్ని సంవత్సరాలుగా కలగానే ఉన్న డబుల్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రయాణికులను ప్రమాదాల బారి నుంచి కాపాడాలి. **- దాము, నిమ్మనపల్లె**

### పాఠశాలలకు ఆలస్యంగా మధ్యాహ్న భోజనం

**పీలేరు రూరల్ :** మండలంలోని వివిధ పాఠశాలలకు శనివారం మధ్యాహ్న భోజనం ఆలస్యంగా వచ్చింది. ప్రతి రోజూ మండలంలోని 72 పాఠశాలలో ఇస్కాన్ భోజనం అందించేవారు. శనివారం మెగా పేరెంట్స్ సందర్భంగా అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. అయితే మధ్యాహ్నం భోజన సమయం మించి పోయినా మండలంలో సగం పాఠశాలలకు మధ్యాహ్న భోజనం అందలేదు. పలు పాఠశాలలో ఖాళీ ప్లేట్లతో విద్యార్థులు భోజనం కోసం ఎదురు చూశారు. ఈ విషయంపై ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతిని వివరణ కోరగా శనివారం మండలంలో సగం పాఠశాలలకు సమయానికి మధ్యాహ్న భోజనం అందలేదని, ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సమాచారం అందించామని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే తమ సొంత ఖర్చులతో భోజనం తెప్పించి పెట్టారని చెప్పారు. కొన్ని పాఠశాలల్లో బిస్కెట్లు, స్నాక్స్ సరఫరి చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల అనంతరం మధ్యాహ్నం భోజనం అందిందని చెప్పారు.


కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనం కోసం విద్యార్థుల ఎదురుచూపు

## అభివృద్ధిని గాలికొదిలిన కూటమి ప్రభుత్వం

**- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి**


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**పీలేరు :** అధికారంలోకి వస్తే ఏదేదో చేస్తామని ప్రజలను మభ్యపెట్టిన కూటమి ప్రభుత్వం నేడు అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. శనివారం కేవీ పల్లె మండలం గోరంట్లపల్లెకు చెందిన గుణశేఖర్ రెడ్డి కుమార్తె రమ్యకు యర్రగుంటపల్లెకు చెందిన అమరనాథరెడ్డి కుమారుడు శ్రావణ్‌రెడ్డితో నిశ్చితార్థం పీలేరు పట్టణం ఎస్వీఎస్ఎస్ కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కేవీపల్లె మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి ఇటీవల కంటి ఆపరేషన్ చేసుకోవడంతో పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తి అయినా సూపర్‌సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటి అమలు చేయడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హబీబ్‌బాషా, నాయకులు జయరామచంద్రయ్య, సతీష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, చక్రదర్, లోకనాథరెడ్డి, దర్మారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, మస్తాన్, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

### 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం

**-ఐక్యరాజ్య సమితి ఏకగ్రీవ ఆమోదంపై హర్షాతిరేకం**

**కురబలకోట:** ప్రతి ఏటా డిసెంబరు 21న అంతర్జాతీయ ధ్యాన దినోత్సవ నిర్వహణకు ఐక్యరాజ్య సమితి ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం ఎంతైనా హర్షణీయమని మండలంలోని కడప క్రాస్ దగ్గరున్న అచలార క్షేత్ర ధ్యాన కేంద్రం నిర్వాహకులు సద్దికూటి శ్రీనివాసులు, ఎస్. హరినాథ్,ఎస్. దామోదర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ భారత్ సహా ఇతర దేశాలు తీసుకు వచ్చిన తీర్మానాన్ని 193 మంది సభ్యులున్న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం ప్రశంసనీయమన్నారు. ఇది ధ్యానులకు, అభ్యాసకులకు సరికొత్త మలుపు, ప్రోత్సాహానికి నాందియన్నారు. శరీరానికి పోషణ ఎంత అవసరమో మనసు ఆత్మకు ధ్యానం అంత అవసరమన్నారు.

## ఆకేపాటి మహాపాదయాత్రకు సంఘీభావం


ఆకేపాటి అమరనాథరెడ్డి మహాపాదయాత్రలో నిసార్‌అహ్మద్

**మదనపల్లె :** అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి 22వ తిరుమల మహాపాదయాత్రలో మదనపల్లె వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. శనివారం ఉదయం మహాపాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ ఆకేపాటితో కలిసి కొంతదూరం పాదయాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ... కలియుగదైవం శ్రీ వెంకటేశ్వరస్వామిపై అచంచల భక్తి విశ్వాసాలతో 22సార్లు తిరుమలకు మహాపాదయాత్ర చేసి స్వామివారిని దర్శించుకోవడం ఆకేపాటి పూర్వజన్మ సుకృతమన్నారు. వెంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలు ఆయనకు మెండుగా ఉండాలని, ప్రజాసేవ చేసే అదృష్టం కలకాలం ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్

**కేవీపల్లె :** మండలంలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. మండలంలో రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు అరికట్టడానికి సమిష్టి కృషి అవసరమన్నారు. అనంతరం శాఖల వారిగా మండలంలో జరుగుతున్న ప్రగతి చదివి వినిపించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ హరిబాబు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి

**మదనపల్లె సిటీ:** సుబ్రమణ్య షష్టి పురస్కరించుకుని శివాలయాల్లోని సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయంలోని శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో బాల సుబ్రమణ్య స్వామికి అర్చకులు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజేయస్వామి ఆలయం, నిమ్మనపల్లె రోడ్డులోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో షష్టి పూజలు ఘనంగా నిర్వహించారు.

## ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

**మదనపల్లె సిటీ:** విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శనివారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాలను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. అన్ని రంగాల్లో రాణించి అందరికీ స్ఫూర్తిగా నిలవాలన్నారు. వెలుగు సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు వినికిడి యంత్రాలను అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన కట్టుకుంది. అనంతరం ప్రతిభ కనబరిచిన విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి,శ్రీకృష్ణ గ్రూప్స్ అధినేత మార్పూరి శశిధర్‌రావు, ప్రిన్సిపాల్ లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ


నిరాశ్రయులకు దుప్పట్లు కప్పుతున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

**మదనపల్లె సిటీ:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిరాశ్రయులు చలికివణుకుతున్నారు. సంచిపట్టలు, పాత కాగితాలు చుట్టూ పెట్టుకుని చలికి బిక్కుబిక్కుమంటున్నారు. మదనపల్లె చలి ప్రదేశం. నిరాశ్రయులు పడుతున్న బాధలను చూసి హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు చలించిపోయారు. మదనపల్లెకు చెందిన లీలా, స్వాతి,దీపిక, దివ్యకాంత సహకారంతో ఆదిలక్ష్మిలకు తెలియజేశారు. వెంటనే వారు స్పందించి ముందుకు వచ్చి దుప్పట్లను కొనుగోలు చేశారు. శనివారం రాత్రి మదనపల్లె ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, బెంగళూరు, చిత్తూరు బస్టాండు ప్రాంతాలు,నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరినగర్ ప్రాంతాల్లోని నిరాశ్రయులకు దుప్పట్లు కప్పి చలి బారి నుంచి రక్షణ కల్పించారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు కిరణ్,పవన్, మన్సూర్, ఉస్మాన్,రెడ్డి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాలల మహాగర్జన విజయవంతం చేయాలి


మాలల మహాగర్జన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

**మదనపల్లె :** సుప్రీంకోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పును రద్దుచేయాలని మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాలల మహాగర్జన సమావేశాన్ని జయప్రదం చేయాలని దళిత సంఘర్షణ సమితి నాయకులు కోరారు. శనివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో హలో మాల చలో గుంటూరు పోస్టర్లను ఆవిష్కరించారు. సభకు రాజకీయ నాయకులు, మేధావులు, మాల ఉద్యోగులు, అంబేద్కర్‌వాదులు, మాల విద్యార్థులు, మాల ఉద్యమకారులు హాజరవుతారన్నారు. మాలల మహాగర్జనకు లక్షల సంఖ్యలో మాలలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిలభారత మాలసంఘాల జేఏసీ కన్వీనర్ గుర్రం నారాయణ కోరారన్నారు. కార్యక్రమంలో దళిత సంఘర్షణసమితి జిల్లా అధ్యక్షులు నర్సింహులు, డివిజన్ అధ్యక్షులు అంబేద్కర్‌చంద్ర, టీచర్ శంకర, ఎల్ఐసీ సహదేవుడు, మునివెంకటప్ప, టీచర్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం బాటలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

**మదనపల్లె సిటీ:** విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, బసినికొండ ఉన్నత పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ ఆత్మీయ సమావేశాలు జరిగాయి. పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు, హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రకళ, వైస్ చైర్మన్ పఠాన్ అక్బర్‌ఖాన్,ఫోర్డు లలితమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక మయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి టు టౌన్ ఎస్.ఐ గాయిత్రి పాల్గొన్నారు. సైబర్ క్రైమ్స్, డ్రగ్స్‌పై పోస్టర్లను ఆవిష్కరించారు. బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి టుటౌన్ సీఐ రామచంద్ర హాజరయ్యారు. డ్రగ్స్ వాడడం వల్ల కలిగే నష్టాలు గురించి తెలియజేశారు.

**అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు**

**రామసముద్రం:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. మోడల్ స్కూల్ చెర్మెన్ బాలాజీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తు కార్యాచరణ గురించి వివరించారు. అలాగే మట్లవారిపల్లిలో చైర్మన్ కృష్ణప్ప, ఎర్రప్రశెట్టిపల్లిలో చైర్మన్ వెంకటరెడ్డి, చెంబకూరు హైస్కూల్ లో చైర్మన్ శంకర ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు.

**ప్రైవేటు పాఠశాలలకు దీటుగా..**

**నిమ్మనపల్లె :** ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివద్ధి చెందాయని ఎంఈఓ పద్మావతి, జడ్పీ హైస్కూల్ (తెలుగు) హెచ్‌ఎం అంజాద్ అలీ ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల ( పిటిఎం ) ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలను, వివిధ పోటీలను నిర్వహించారు. తల్లిదండ్రులకు రంగోలి, ఆట పోటీలు నిర్వహించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణయ్య, వైస్ చైర్మన్ రెడ్డి శిల్ప, డాక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.

**విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులదే పాత్ర**

**తంబళ్లపల్లె:** విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులదే కీలక పాత్ర అని ఎస్ఐ లోకేష్‌రెడ్డి అన్నారు. శనివారం తంబళ్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికల పట్ల దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి , ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**విద్యార్థులకు బంగారు భవిష్యత్తు**

**కురబలకోట:** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ హైస్కూల్ కో ఆప్షన్ మెంబర్ జంగా రాఘవరెడ్డి అన్నారు. హెచ్‌ఎం త్రివేణి ఆధ్వర్యంలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, టీచర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, కృష్ణారెడ్డి శిద్దార్థ జూనియర్ కళాశాల నిర్వాహకులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులు, సమాజం గర్వపడేలా ఎదగాలన్నారు.

**విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి**

**కేవీపల్లె :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్. శశికళ అన్నారు. శనివారం మండలంలోని వగళ్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**విద్యార్థులపై ప్రత్యేక నిఘా ఉంచాలి**

**పీలేరు :** విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక నిఘా ఉంచాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు అన్న పేరుతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీరాములు, హెచ్‌ఎం నటరాజ, నాయకులు కోటపల్లె బాబురెడ్డి, రెడ్డిబాషా, రామ్మూర్తి, రియాజ్, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

**క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి**

**పెద్దమండ్యం:** ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని ప్రతి పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దమండ్యం మోడల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను, తల్లిదండ్రులనుద్దేశించి ఎంపీపీ మాట్లాడారు. సెల్‌ఫోన్‌లకు విద్యార్థులను దూరంగా పెట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్ రావు, ఎంఈవోలు మనోహర, రామక్రిష్ణ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

**తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా..**

**పెద్దతిప్పసముద్రం:** మండలంలోని ప్రభుత్వ స్కూళ్లల్లో శనివారం మెగా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పిల్లల తల్లిదండ్రులకు పాఠశాలల సందర్శన, పిల్లలకు ముగ్గులు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలచే ఉపన్యాసాలు, ప్రతిభ చాటిన పిల్లలకు ప్రగతి పత్రాలను అందజేశారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రవికుమార్ హితబోధ చేశారు. అధికారులు శ్రీరాములు నాయక్, అబ్దుల్ కలాం ఆజాద్, నారాయణ, గౌస్‌పీర్, పురుషోత్తం నాయక్, హెచ్‌ఎంలు, స్కూల్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.